# కట్టని వంతెన

కుమారి పోరంకి కనకలక్ష్మి

టేబిలుమీద అలారం టైంపీస్ టిక్‌టిక్ మంటూ తన విధి నిర్వర్తిస్తోంది.

ప్రక్కగా రెండు డైరీలు ఒకదాని నొకటి పలకరించుకుంటున్నాయి !

గోడమీది క్యాలెండరులో కాగితాలు గాలికి రెపరెపలాడుతూ ఉన్నాయి.

* * * *

సుందరానికి మనస్సు ఏమీ బాగోలేదు. అలా బాగోకపోవడానికి అతనికి ప్రత్యేకమైన కారణాలేవీ అక్కర్లేదు. ఏదో యింతదాన్ని గురించి అంతగా ఆలోచిస్తూ ఉంటాడు. మొదటి నుంచీ అతని తత్వమే అంత ! ఎప్పుడూ ఉన్న వాటికే, అప్పుడే ఏదో కొత్త సమస్య వచ్చినట్లుగా బాధ పడుతూ ఉంటాడు. చేయదల్చుకున్న పని ఏదైనా, దానిని గురించి తాను ముందుగా బాగా ఆలోచిస్తాడు. తాను తీసుకునే నిర్ణయం తనకి నష్టమైనా ఎవరికీ బాధ కలిగించకూడదని అతను అస్తమానూ ప్రయత్నం చేస్తూ ఉంటాడు. జీవితంలో ఏదో పోగొట్టుకున్నవాడివలె అప్పుడప్పుడు కంగారు పడుతూ ఉంటాడు. ఏదో వెలితిగా ఉందనీ, ఆ లోటు ఎప్పటికి తీరుతుందో, ఎలా తీరుతుందో నని ఆలోచిస్తూ ఉంటాడు. అతను అలా తరచుగా నిరాశ చెందడానికి ఏదైనా పెద్దగా ఆశలు పెట్టుకుంటాడా అంటే అదీ కనుపించదు. ఏమి చేయాలో తోచక, కాసేపు తీసి చూద్దామని డైరీ తీశాడు సుందరం. ముందు ఏం చేయాలో తోచనప్పుడు వెనకటి అనుభవాలను గుర్తు చేసుకుందుకు డైరీ చూసుకోవడం అతనికి అలవాటే. అలా తాను వ్రాసుకున్న డైరీని ఎన్ని సార్లు చూసుకుంటాడో అతనికే తెలియదు. డైరీ మనిషి మనస్సుకీ, పరిస్థితులకీ అద్దంలాంటిదని అతని నమ్మకం !

"ఈ పాడు జీవితంలో జ్ఞాపకం ఉంచుకోవాల్సిన వాటింటె మర్చిపోవలసినవే హెచ్చు."

"ఆశయాలకీ, పరిస్థితులకీ మధ్య ఎక్కడో తప్పితే సమన్వయం కుదరడంలేదు."

"ఈ రోజున గుంటూరు దగ్గర మీటరుగేజి బండిలో ఒక వంద తెలుగు పుస్తకాలు వ్రాసిన ఓ కవిగారు కనుపించారు. ఆ విషయం ఆయనే చెప్పుకున్నారు, పాపం !"

"మనసా ఎటు ఓర్తునే .... త్యాగరాజ కీర్తన మలయమారుత రాగంలో బాగుంది !"

"ఆఫీసులో సూపరింటెండెంటుతో అనవసరంగా పోట్లాడాను. తర్వాత అనిపిస్తోంది, నేను కూడా కొంచెం తొందరపడ్డానేమో నని. ఆయన కూడా పాపం, ఏ బాధల్లో ఉన్నాడో, కొంచెం ఉద్రేకపడ్డాడు. స్వతహాగా మంచివాడే ఆయన కూడా ! ఏదో అయిపోయింది ! వెరీ అన్‌హ్యాపీ ఇన్సిడెంటు !"

"ఇంటిదగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. డబ్బు ఏదైనా పంపమని కాకపోయినా, అవసర ముందన్నట్లుగా. నిజమే ! ఈమధ్యన ఇంటికి ఏమీ పంపలేదు. వాళ్లూ తిట్టుకుంటూ ఉండి ఉంటారు. నాన్నగారు సరే. జీతమంతా ఏం చేస్తున్నావురా .... అని ప్రతీవాడూ అడగడమేం బాగోలేదు. వీళ్లింకా ఎక్కడో ఉన్నారు. డబ్బుకి విలువ చచ్చిపోయిందని వీళ్లెవలా గుర్తించినట్లు లేదు."

"నేను నీళ్ల మల్లే ఈ లోకంలోకి వచ్చాను. గాలి మల్లే ఈ లోకంలోంచి పోతాను.—చలం రుబాయితుల్లో— మరొకటి కూడా వ్రాసుకోవాలి—తల్లి గర్భం నుంచి బైట పడనివాడొక్కడే ఎరుగును నిజమైన శాంతి సౌభాగ్యాలు."

"నైట్ కాలేజీలో చేరితే బాగుండును. ఈ ఉద్యోగం అస్తి బిస్తి తేలకుండా ఉంది. సర్వీస్ కమిషన్ క్యాండిడేటు రాగానే వన్నింటికి పంపించేస్తారేమో ! అయినా ఈ జీతంతో ఉన్న అవసరాలన్నీ ఎలా తీరుతాయో, ఏమో ! రెండు మూడు లీవ్ వేకన్సీలలో పనిచేసినా ఈసారి ఏదో దొరికింది ఫర్వాలేదనుకున్నాను. ఇది కూడా అనుమానంగానే ఉంది."

"అందమైన పాతికేళ్ల అమ్మాయి ఇటలీలో జీవితాంతం ఖైదులో ఉండాల్సిన ఒక హంతకుణ్ణి టెలివిజన్‌లో

చూసి ప్రేమించి, పెళ్ళాడిందట! ప్రేమ చాలా చాలా గుడ్డిది!"

"సాయోనారా, మై గెయిషా—రెండిటిలోనూ కూడా కొద్దిగా జపాను ప్రజల సంప్రదాయాలను చూపించాడు. చాలా బాగున్నాయి రెండు సినిమాలూ కూడా! ఈ ప్రపంచంలో కాస్త చవకగా దొరికే వినోదం యిదొక్కటే—సినిమాలు తరచుగా చూస్తూ ఉండాలి."

"ఈ టైపింగ్ ఒక్కటే పనికిరాకుండా ఉంది. కాస్త షార్ట్‌హ్యాండ్ కూడా నేర్చుకుంటే బాగుండును. ఈ ఉన్న కాస్త టైమునీ ఎన్నింటికి వినియోగించాలో అర్థం కావడం లేదు."

సుందరం డైరీలో అలా పేజీలు త్రిప్పుతూనే ఉన్నాడు. అందులో మంచి ఉన్నా, చెడు ఉన్నా అలా చదువుకుంటూ ఉండడం అతనికి అలవాటు. అందులోని అందమైన అనుభవాలు తీయని జ్ఞాపకాలనూ, అనుభూతులనూ రేకెత్తిస్తాయి కాబట్టి, కష్టం లేనైనా ఉంటే, తా నిల్లాంటి గడ్డు రోజులు కూడా గడిపాను కదా—అనే ధైర్యాన్ని కలిగిస్తాయి కాబట్టీ—తాను అప్పుడప్పుడు డైరీ చదువుకుంటూ ఉంటానని అతను స్నేహితులతో చెప్తూ ఉంటాడు.

"కాన్రాడ్ ఎయికెన్ చక్కగా చెప్పాడు—టైమంటూ ఉంటే ప్రతి రాత్రీ, ప్రతీ వాడూ ఏడుస్తూనే ఉంటాడు, కాని కళ్ళల్లోకి నీళ్ళు రాకముందే నిద్ర వచ్చేస్తుంది."

"ప్రక్కింటివాళ్ల భారతి మశూచి వచ్చి పోయింది. పాపం! చాలా చురుకైన పిల్ల! భగవంతుడు ఏమీ తెలియన్ని ఆ పసిపాపని తీసుకెళ్లి ఏం చేసుకుంటాడో!"

"పెద్ద పెద్ద డిగ్రీలకు కూడా విలువ పడిపోయిన ఈ రోజుల్లో నా చదువు దేనికీ చాలదు. నైట్ కాలేజీలో ఈఏడైనా చేరితే బాగుండును."

"ఈరోజు కాసేపు భగవద్గీత చదువుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంది. గీత గీసుకుని కూర్చుని దాటడానికి భయపడుతాడు అర్జునుడు. ఆ గీత చెరిపేసి, మరో గీత గీసి, అక్కడిదాకా రావచ్చునంటాడు కృష్ణుడు. ఈ అర్జున గీతలూ, భగవద్గీతలూ నిత్యజీవితంలో మనుష్యుల్నీ, మనుష్యుల స్వభావాల్నీ తమాషాగా చిత్రిస్తూ ఉంటాయి!"

"శిథిల దేవాలయంలో ఏమీ లేకపోయినా దేవుడైనా ఉంటాడు. బ్రతికి చెడ్డవాళ్ల పాత గాథల్లో బొత్తిగా ఏమీ మిగలదు!"

"మన్ కీ ఆంఖ్ సె దేఖో,
కణ్ కణ్ మే భగవాన్"—ఈ చరణం చాలా బాగుంది."

* * * *

సుందరం ఒక పల్లెటూరి మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. చిన్నతనంలో కొంచెం గారాబంగానే పెరిగినా, ఆ తర్వాత తర్వాత సంసారం పెరగడంతోటీ, ఆర్థికమైన యిబ్బందులతోటీ కష్టసుఖాలను తెలుసుకునే అవకాశం కలిగింది అతనికి.. మరీ పసితనంలో తాను ఏదో పెద్ద చదువులు చదవాలనీ, మంచి హోదా గల ఉద్యోగం తనకు రావాలనీ, ఎన్నో కలలు కన్నాడు కాని, పోనుపోనూ తాను ఎక్కడ ఉన్నదీ తెలుసుకున్నా డతను. తండ్రి ఎలిమెంటరీ స్కూలు హెడ్‌మాస్టరు. అయినా కూడా ఆయన జీవితం చాలాకాలంపాటు సాఫీగా గడచిపోవడానికి మొదట్లో కొద్దో గొప్పో ఆస్తి ఉండేది. స్వంత యిల్లూ, కొంత భూమీ ఉండడంతో ఆయన జీతం ఏదో పై ఖర్చుకి తప్పితే మిగతా వాటికి అవసరమయ్యేది కాదు. అది ఎలాగూ సరిపోదు కూడాను. కాని పోనుపోనూ ఆ ఆస్తి హారతి కర్పూరం అయిపోయింది. సుందరానికి బాగా కాకపోయినా, కొద్దో గొప్పో యివన్నీ తెలుసును. ఈ మధ్య తరగతి కుటుంబాల్లో పిత్రార్జితం అంతా బారసాలలూ, అన్నప్రాసనలూ, వడుగులూ, పెళ్లిళ్లూ, అల్లుళ్ల అలకలు తీర్చడం, ఆడపిల్లల పురుళ్లు పోయడం, పరువు ప్రతిష్టలంటూ ఊళ్లోవాళ్లకి బూరె ముక్కలు తినిపించడం—వీటికిందే పోతుందని సుందరానికి ఒక పెద్ద నమ్మకం. అలా అని దానికి విరుగుడు ఏం చేయాలో అతనికీ సరిగా తెలియదు. పరువు, మర్యాద, గౌరవం, మానవత్వం—యిలాంటి మాటలకి ఏమీ విలువ యివ్వనివాడు ఆర్థికంగా ప్రయోజకు డవుతాడని, కొందరిని చూశాక అతనికి అనిపిస్తూ ఉండేది. ఆస్తుల పరిస్థితి అట్లా ఉంటే నెలనెలా వచ్చే జీతాలు పంపకాలకే సరిపోతుందని అతని అనుభవం. ఆఫీసులో క్యాంటీనువాడి దగ్గర్నుంచి, ఇంట్లో పనిమనిషి దాకా .... అందరూ కూడా వాళ్లకి రావల్సిన వాటాల కోసం నెలనెలా కాచుక్కూచుంటారు. ఈ మధ్య తరగతి మనుషులకి నిత్యావసరాల కంటె చిల్లర ఖర్చులు ఎక్కువగా ఉండడం అతనికి కొంత ఆశ్చర్యంగానే ఉండేది. వాళ్ల ఇంట్లో కాపురముంటూన్న రామారావు కుటుంబాన్ని చూశాక అతనికి తన అభిప్రాయాల్లో నమ్మకం కలిగేది. అయితే ఆ చిల్లర ఖర్చు కూడా నిత్యావసరాల్లాంటి ఖర్చే అవడం అదో విశేషం!

* * * *

డైరీలో పేజీలు సుందరం వ్రేళ్లమధ్య పరుగెడుతున్నాయి.

"ఈరోజున నాన్నగారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది—రాయవరం సంబంధం అన్నానే, వాళ్ళు ఒచ్చి మాలతిని చూసుకుని వెళ్లారు. కట్నం మూడువేలకి తగ్గమన్నారు. పైగా లాంచనాలు కూడా కావాలట. మనం ఎక్కడ తూగగలం అలాంటివాళ్లతో ? ఇప్పుడు పెళ్లిచేస్తే సరిపోదు కదా ? ముందు ముందు ప్రతీదీ యిదే ఫక్కీలో జరిపించాల్సి వస్తుంది. ఇదొక్కత్తే కాదు కదా ? ఈరోజున దీనికి ఎంత కట్న మిస్తే అంతకీ, ఆఖరుదానికి కూడా పైన తగ్గడానికి ఉండదు. ఏం చేస్తాం ? మనకు అన్ని విధాలా అనువైన సంబంధం వచ్చినప్పుడే చేద్దాం ! ఆ రోజుల్లో పెద్దవాళ్లిద్దరి పెళ్లిళ్లే నయం. చులాగ్గా అయిపోయాయి ! ఏమిటో ఈ చిన్నతనంలోనే నీకు ఈ బరువులూ, బాధ్యతలూ .... అన్నీ చెప్పి బాధపెట్టాల్సి వస్తోంది."

నిజమే, ఆ ఉత్తరం వచ్చిన రోజున తాను కూడా చాలా బాధపడ్డాడు. కాని తను ఏం చేయగలడు ? అక్కయ్యలిద్దరి పెళ్లిళ్లు చేసే టైముకి ఏదో ఆస్తి ఉండబట్టి, అప్పటి రోజుల్లో గడిచిపోయింది. ఈ గడ్డు రోజుల్లో ఈ కట్నాల బాధొకటి విపరీతంగా ఉంది. ఇంకా ఇద్దరు చెల్లెళ్ల పెళ్లిళ్లు జరగాల్సినవి ఉన్నాయి. ఏది ఎలా అవుతుందో, ఏమో తెలియడంలేదు. తను త్వరగా ఏదైనా మంచి ఉద్యోగంలో స్థిరపడినా బాగుండిపోను !

"ఇంటి దగ్గర్నుంచి మరో ఉత్తరం వచ్చింది.—నీకు వెనక ఏదో ఉత్తరంలో రాసినట్టున్నాను. నిర్మలకి. పథ్యం పెట్టాము. పాడు జ్వరం చాలా రోజులు పీడించింది. ఏమి డాక్టరో ఏమో ? దానికి పెట్టని పేరంటూ లేదు ఫ్లూ, న్యూమోనియా, మలేరియా, టైఫాయిడ్, డబుల్ టైఫాయిడ్ .... చాలా చాలా పేర్లు పెట్టాడు. మందులకీ ఆయన ఫీజులకీ బోలెడయింది. ఏదో మొత్తానికి బతికి బయటపడింది. అదే పదివేలు. అన్నట్టు రాయడం మరిచాను. పెద్దక్క పురిటికి వచ్చింది. ఇప్పుడు ఏడోనెల. వాళ్లాయన వచ్చి దిగబెట్టి నాలుగురోజు లుండి వెళ్లిపోయాడు. నీ ఆరోగ్యం కాపాడుకుంటూ ఉండు. దూరాన ఒక్కడివీ ఉంటున్నావు కూడానూ !"

ఏమిటో, డైరీలో ఒక్కోసారి ఉత్తరాలు కాపీ చేయడం జ్ఞాపకం వచ్చి తనకే ఆశ్చర్యం వేసింది సుందరానికి. కావాలంటే ఆ ఉత్తరాలు దాచుకోవచ్చునే ! ఏమిటో అప్పుడు అదో పిచ్చి !

* * * *

ఈదురుగాలి రివ్వున వీచింది. ఆ గాలికి తలుపులు దబదబా కొట్టుకున్నాయి. వెళ్లి తలుపులకి చిడతపెట్టి వచ్చాడు. కాసేపా డైరీని మూసి పక్కకు పెట్టాడు. ఎంత అభిమానించినా ఒక్కోసారి డైరీలమీద కోపం కూడా వస్తూంటుంది అతనికి. రోజులు గడిచిపోయినకొద్దీ మర్చిపోవలసిన సంఘటనలను కూడా అవి గుర్తుకి తెస్తూ ఉంటాయి. గోడమీది క్యాలెండరు గాలికి రెపరెపలాడి క్రింద పడిపోయింది. దానిని తీసుకెళ్లి మళ్లీ మేకుకి తగిలించాడు. ఏళ్లకి ఏళ్లు గబగబా పరుగెడుతున్నట్టు అనిపించింది అతనికి. తాను హైదరాబాదు వచ్చి అప్పుడే మూడేళ్లయింది. మూడేళ్ల నుంచీ తాను ఏం చేస్తున్నట్టు ? ఏదీ సాధించలేక పోయాడు తను. కేవలం తన పొట్ట తాను పోషించుకుంటున్నాడంతే ! ఏళ్లకి ఏళ్లు నెలల మాదిరిగా పరుగెడుతున్నాయి. కాలానికి యింత వేగం ఎట్లా పెరిగిందో ? మనిషి చేయదల్చుకున్న దేమీ చేయలేకపోవచ్చు ! అతను అలాగే ఉండిపోవచ్చు ! .... ఇవేమీ కాలానికి నిమిత్తంలేదు. ప్రతివాడినీ కాటికి దగ్గరగా తీసుకుపోవడమే కాలం కర్తవ్యం. నెలవగానే క్యాలెండరు కాగితాలు చిరిగిపోతాయి. కొత్త సంవత్సరం రాగానే గోడమీది క్యాలెండర్లు మారిపోతాయి. కాని మనిషి పాత మనిషే మిగిలి ఉంటాడు. అతనిలోని ఆ పాత ఊహలకి ఓ రూపురాక, ఎప్పటివో ఆ పాత కోరికలు ఇంకా తీరక అవన్నీ అలానే నిల్చిపోయి ఉంటాయి. అయితే కాలం యిలా పరుగెత్తి ఏం ప్రయోజనం ? ఎవరికి ఉపయోగం ? ఎందు కింత హడావుడిగా సంవత్సరాలు దొర్లిపోతున్నాయి ? 'నిన్న' ఎలా వెళ్లిందో, రేపు కూడా అలాగే వస్తే కొత్తదనం ఏముంటుంది ? బ్రతుకులో అందం ఎక్కణ్ణుంచి వస్తుంది ? అలా కాకూడదు. వచ్చే రోజులు అందంగా రావాలి, అందరికీ ఆనందాన్ని తేవాలి. అలా కాకపోతే అసలు రావక్కర్లేదు. గతం గురించి ఆలోచించక్కర్లేదు. భవిష్యత్తు గురించి ఊహించుకో నక్కర్లేదు. డైరీలు వృథా ! ఈ క్యాలెండర్లు వృథా ! మనుష్యులు సాధించలేనివి ఏం సాధిస్తాయి అవి ? ఎక్కడో చదివాడు తాను—నిన్నా, రేపూ అనే వాటికి ఈ రోజనేది కట్టని వంతెనట ! ఎంత బాగుంది ? కాని, తాను నిన్న గురించి మర్చిపోవాలి. రేపు గురించి ఆలోచించకూడదు. మహా అయితే కొద్ది గంటలకు మించి అసలు ఊహించకూడదు. అసలు కాలమానంలో గంటలకి పైన మరే కొలతా ఉండకూడదు. ప్రతివాడి మాట తనకు తెలియదు, కాని, తాను మటుక్కి ఎప్పటికీ ఆ వంతెన మీదే నడుస్తాడు. ఆరోజా చల్లగా వీచే ఆ గాలులూ, ఏ రోజూ అందంగా కెరటాలమీద మిలమిలా మెరిసే సూర్యుని బంగారు కిరణాలూ, భూమితో రకరకాల దోబూచులు ఆడుకునే చందమామా .... అవి చాలు తనకు. తను ఏ ఒడ్డుకీ కూడా పోడు ! ఎప్పటికీ ఆ వంతెనమీదే అలా అనంతంగా నడుస్తూ ఉంటాడు. ఎప్పుడో, తప్పనిసరిగా గుర్తుకి వస్తే ఆ ఒడ్డుమీది జనం పడే బాధలకి తా నొక కన్నీటిచుక్క రాలుస్తాడు, అంతే !

సుందరం క్యాలెండర్లు చుట్టచుట్టి డ్రాయర్లో పడేశాడు !

డైరీలు ట్రంకుపెట్టెలో ఓ మూలగా దాచేశాడు !!

టైంపీస్ మటుక్కి టిక్ టిక్ మంటూ తన విధి సక్రమంగా నిర్వర్తిస్తోంది.